5 నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-కాకినాడ

వికాస ఆధ్వర్యంలో మే 5వ తేదీ నుంచి వాకలపూడిలోని డిడియుజికెవై సెంటర్‌లో నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కెఎల్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమో ఉత్తీర్ణులైన 18 నుంచి 30 ఏళ్ల లోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. టూ వీలర్ టెక్నీషియన్, వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సులకు 3 నెలలు శిక్షణ ఇచ్చి అనంతరం ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం కల్పిస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం సెంట్రల్ గవర్నమెంట్ ద్వారా సర్టిఫికెట్ ఇస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మే 4వ తేదీలోపు 8328483297, 8978475164 నెంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

రచ్చబండ రద్దుతో ప్రజల్లో నిరాశ

- సమస్యలు చెప్పుకునే అవకాశం లేక వెనుదిరిగిన ప్రజలు
- శంకుస్థాపనలకే పరిమితమైన డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

చాలాకాలం తర్వాత తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గానికి పవన్ కళ్యాణ్ వస్తుండడంతో అనేక సమస్యలను చెప్పుకుందామని స్థానిక ప్రజలు ఆశించారు. అయితే వారికి నిరాశే మిగిలింది. పిఠాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు, రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తొలుత డిప్యూటీ సిఎం పర్యటన ఖరారైంది. శుక్రవారం డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ వచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అయితే ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిన 'రచ్చబండ' కార్యక్రమాన్ని అర్థాంతరంగా రద్దు చేశారు. దాంతో వందలాదిమంది అర్జీదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

దేశం మొత్తం పిఠాపురం వైపు తిరిగి చూసేలా అభివృద్ధి చేస్తానని గతంలో పవన్ పలు సందర్భాల్లో ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే రాకరాక వస్తున్న డిప్యూటీ సీఎంకు సమస్యలు చెప్పుకుందామని అనేకమంది ఆశించారు. ఆయనకు చెప్పుకుంటే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని అనుకున్నారు. కానీ అందుకు భిన్నంగా రచ్చబండను రద్దు చేయడంతో ఆందోళన వ్యక్తం చేశారు. రచ్చబండ నిర్వహణకు తగినట్లుగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ కార్యక్రమానికి సంబంధించి పలువురికి పాసులు కూడా అందజేశారు. దీంతో అనేకమంది తమ సమస్యలను విన్నవించుకునేందుకు సిద్ధ పడ్డారు. కానీ అనూహ్యంగా రచ్చబండ కార్యక్రమానికి పవన్ హాజరు కావడం లేదంటూ అధికారులు

రచ్చబండ వేదిక

తెలపడంతో అటు జన సైనికులు, ఇటు స్థానిక ప్రజానీకం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

పవన్ పిఠాపురం ఎంఎల్ఎగా గెలుపొంది సంవత్సరం గడుస్తున్నా మూడు మండలాల్లో పూర్తిగా పర్యటించిన దాఖలాలు ఎక్కడా లేవు. రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తే అనేక ఏళ్లుగా ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న ప్రజానీకం పవన్ దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరించుకుందామని ఆశగా ఎదురు చూసినా నిరాశ తప్పలేదు. ఇప్పటికైనా ఆయన నియోజవర్గంలోని ప్రజలను కలిసి తమ గోడు వెళ్ళబుచుకునేందుకు సమయం ఇవ్వాలని పలువురు జన సైనికులు సైతం కోరుతున్నారు.

రెండు గంటలు ఆలస్యంగా పర్యటన

షెడ్యూల్ ప్రకారం రావాల్సిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దాదాపు రెండు గంటల ఆలస్యంగా తన పర్యటన సాగించారు. దాంతో మండుటెండలో అనేకమంది తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. యంత్రాంగం సైతం ఇబ్బందులు పడ్డారు. పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం వందలాది మంది రోగులు వైద్య సేవల కోసం వస్తుంటారు. అయితే ఒపి సేవలు సక్రమంగా నిర్వర్తించకపోవడంతో అనేకమంది తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. గర్భిణులు సైతం మండుటెండలో నడచి వెళ్లి వైద్య సేవలు పొందాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉదయం 8 గంటల నుంచి పోలీసులు రోగులను కట్టడి చేయడంతో అనేకమంది వెనుదిరగాల్సి వచ్చింది. అత్యవసరమైన రోగులను తప్ప మిగిలిన అనుమతించలేదు. సాయంత్రం 5 గంటల తర్వాత రమ్మని పోలీసులు వారికి చెప్పడంతో పలువురు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసులతో వర్మ వాగ్వివాదం

పవన్ కళ్యాణ్ పర్యటనలో భాగంగా పోలీసుల తీరుపై టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్‌విఎస్ఎన్.వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్మకు కాకినాడ ఎస్‌పి జి.బిందుమాధవ్‌కు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. స్థానిక అంబేద్కర్ భవన్‌లో మహిళలకు కుట్టు మిషన్లు, శిక్షణా కేంద్రంతో పాటు రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేశారు. ఈ కార్యక్రమం జరిగే స్థలం తక్కువగా ఉండడంతో నాయకుల్ని పోలీసులు నియంత్రించారు. ప్రాంగణంలోకి పార్టీ క్యాడర్‌కు అనుమతివ్వక పోవడంతో వర్మ అభ్యంతరం తెలిపారు. 'మాకు ఈ అవమానాలు ఏంటి? వెళ్ళిపోతాం' అని ఈ సందర్భంగా వర్మ వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జరగబోయే కార్యక్రమానికి విఐపిలకు మాత్రమే ఎంట్రీ ఉంటుందని ఎస్‌పి సమాధానం చెప్పారు. దీంతో కొద్దిసేపు అక్కడ స్వల్ప వాగ్వాదం జరిగింది. అంబేద్కర్ భవన్ కు చేరుకున్న పవన్ అక్కడ ఉన్న వర్మను చూసి పలకరించి ఆయనతో లోపలికి తీసుకుని వెళ్లారు.

రోగులను అడ్డుకుంటున్న పోలీసులు

శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్

మంత్రి పవన్‌కు ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి

ప్రజాశక్తి-పిఠాపురం

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు అంబేద్కర్ భవన్‌లో ఉపాధి హామీ జెఎసి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ సంఘం నాయకులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు వివి.కిరణ్, పిఠాపురం ఫీల్డ్ అసిస్టెంట్ చెల్లారావు మాట్లాడారు. దాదాపు 2 దశాబ్దాల పాటు విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఫీల్డ్ మీదుండి పనులు చేయించే తమకే పనిలేని లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలకు కూడా నోచుకోకుండా పథకంలో ఏళ్లుగా పని చేస్తున్నా గుర్తింపు లేదన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు గత ప్రభుత్వం పిఆర్‌సి ప్రకారం 23 శాతం జీతాలు పెంచకపోగా, పదోన్నతులు కూడా కల్పించలేదన్నారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. దీనిపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

డిప్యూటీ సిఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

విద్యార్థులను సత్కరిస్తున్న ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప

ప్రభుత్వ విద్యా సంస్థల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి- సామర్లకోట

ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణకు, అభివృద్ధికి ఎంతగానో చర్యలు తీసుకుంటోందని, దానికి ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ ఫలితాలే నిదర్శనమని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయ చినరాజప్ప పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. అయోధ్యరామపురం మున్సిపల్ పాఠశాల 585 మార్కులతో మండల స్థాయి ప్రథమ స్థానంతో పాటు జిల్లా టాప్ టెన్‌లో ఉండడం, మంచి ఉత్తీర్ణతతో పట్టణంలో నెంబర్ వన్‌గా ఉండడం అభినందనీయమని ఎంఎల్ఎ చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి పేర్కొన్నారు. 500 మార్కుల పైబడి సాధించిన 16 మంది విద్యార్థులకు ఎంఎల్ఎ, కుడా చైర్మన్ జ్ఞాపికలు, గోల్డ్ మెడల్స్‌తో విద్యార్థులను అభినందించారు. మంచి ఫలితాలు సాధించిన హెచ్ఎంను స్టాఫ్‌ను అభినందించారు. టిడిపి నాయకులు కంటే బాబు, యార్లగడ్డ చిన్ని, కౌన్సిలర్ బలుసు వాసు, అడబాల కుమారస్వామి, నిమ్మకాయల కిరణ్ కుమార్, సరోజ్ వాసు, మంచం సాయి, మడగల శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎపిఇఎపిసెట్ దరఖాస్తులకు ఫైన్‌తో గడువు పెంపు

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర ఉన్నత విద్యామండలి నేతత్వంలో జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎపిఇఎపి సెట్-2025 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షకు ఫైన్ లేకుండా గురువారంతో గడువు ముగిసిందని, ఫైన్‌తో మే 1వ తేదీ నుంచి గడువు ఉందనిసెట్-2025 చైర్మన్, జెఎన్‌టియుకె విసి ప్రొఫెసర్ సిఎస్ఆర్‌కె.ప్రసాద్ తెలిపారు. ప్రవేశ పరీక్షకు అపరాధ రుసుం లేకుండా గురువారం వరకు 3,58,017 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు ఆయన వివరించారు. ఇంజినీరింగ్ విభాగానికి 2,77,507 మంది దరఖాస్తు చేసుకోగా, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి 79,610 మంది దరఖాస్తు చేసుకున్నారని, రెండు విభాగాలకు 900 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకోని విద్యార్థులు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రూ.వెయ్యి ఫైన్‌తో మే 1 వరకూ, రూ.2000 ఫైన్‌తో మే 7వ తేదీ వరకు, రూ.4 వేలు ఫైన్‌తో మే 12వ తేదీ వరకు, రూ.10 వేలు ఫైన్‌తో మే 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని సుబ్బారావు తెలిపారు. విద్యార్థులు తమ దరఖాస్తులో ఏదైనా సమాచారాన్ని తప్పుగా పూరిస్తే వారు హెల్ప్ లైన్ సెంటర్‌ను సంప్రదించాలని, మే 6వ తేదీ నుండి మే 8వ తేదీ వరకు సవరించుకునేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా 0884-2359599, 0884-2342499 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

కార్టూ'నిజం'



ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా పెంపు

1 నుంచి అథ్లెటిక్స్ కోచింగ్ క్యాంపు

ప్రజాశక్తి - పెద్దాపురం

జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు బాల బాలికలకు స్థానిక మహారాణి కళాశాల క్రీడా మైదానంలో సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు, అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్షులు టివిఎస్.రంగారావు, సెక్రటరీ కె.సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎస్‌వివిఎల్‌జి.వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు రెసిడెన్షియల్ క్యాంపు, బాలికలకు నాన్ రెసిడెన్షియల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. 8 నుంచి 16 సంవత్సరాల బాలబాలికలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటల్లోగా వాట్సాప్ నెంబర్ 9381368116 ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మే 1వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటలకు తల్లిదండ్రుల అనుమతి లెటర్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో మహారాణి కళాశాలలో రిపోర్ట్ చేయాలన్నారు.

ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి గండేపల్లి

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను అర్హులైన బడుగు బలహీన, ఎస్‌సి, బిసి, వికలాంగులు, హెచ్ఐవి, బాధితుల పిల్లలకు ఉచిత విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని విద్యాశాఖ అధికారి కెహెచ్.నాయక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి ఒక్కరికి పూర్తిస్థాయిలో విద్య అందించాలని, ముఖ్య ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని, అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత విద్య అందించాలని, జిల్లా ఉన్నతాధికారి డిఇఒ పి.రమేష్ ఆదేశాల మేరకు ఈ నెల 28 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు దీనిపై సమగ్ర సమాచారం తెలుసుకొని స్థానిక సచివాలయం, ఆన్‌లైన్ సెంటర్లు, మీసేవ, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 28 నుండి మే 15 వరకు దరఖాస్తుల స్వీకరిస్తామన్నారు.

166 వితంతు పెన్షన్ల మంజూరు

ప్రజాశక్తి -కరప

కరప మండలానికి 166 వితంతు పెన్షన్లు మంజూరుకు సిద్ధంగా ఉన్నాయని, భర్త చనిపోయిన వితంతువులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ ఎం.అనుపమ తెలిపారు. ఈ పెన్షన్లను 12.2023 నుంచి 31.10.2024 వరకూ సంబంధించి భర్త పెన్షన్ వస్తూ చనిపోయి ఉంటే అతని భార్యకు అర్హత ఉంటుందని, ఈ కొత్త పింఛన్లకు సంబంధించి మే ఒకటి నుండి పంపిణీ చేస్తామని అనుపమ తెలిపారు.

మల్లేపల్లి స్కూల్ టాపర్‌గా మధు శ్రీలక్ష్మి

ప్రజాశక్తి-గండేపల్లి

పదో తరగతి ఫలితాల్లో ప్రథమ 529 మార్కులు సాధించి మల్లేపల్లి హైస్కూల్ టాపర్‌గా నిలిచిన పోతుల మధు శ్రీలక్ష్మిని హెచ్ఎం సుధా మాధురి అభినందించారు. గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు, ఉప సర్పంచ్ దొమ్మా శ్రీను, విద్యా కమిటీ చైర్మన్ కంచర్ల సుబ్రహ్మణ్యం, బంధువులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు మధు శ్రీలక్ష్మికి అభినందనలు తెలిపారు.

శ్రీలక్ష్మిని అభినందిస్తున్న హెచ్ఎం

ఉగ్ర దాడి మృతులకు ఘన నివాళి

కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారికి నివాళు లర్పిస్తూ శుక్రవారం పలుచోట్ల కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రవి చక్రవర్తి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మ మాట్లాడారు. యుటిఎఫ్ కార్యాలయం నుంచి ఇంద్రపాలెం వంతెన అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.సూరిబాబు, కెవివి.నగేష్, గౌరవాధ్యక్షులు ఎంవి.సాయిరాం, కోశాధికారి పివిఎన్ గణేష్‌తో పాటు ఎస్.వీరబాబు, డి.కనక దుర్గాదేవి, కె.పెద్దిరాజు, ఆర్.జయప్రకాష్, పి.గిరిధర్ గోపాల్ పాల్గొన్నారు.

పెద్దాపురం సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ వరహాలయ్యపేట, నువ్వుల గుంట వీధి, మేదర వీధి మీదుగా మెయిన్ రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు, మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతి కుమార్, కృష్ణ, సత్యనారాయణ, నరసింహమూర్తి, అప్పన్న, చింతల సత్యనారాయణ, తాడిశెట్టి గంగ, ఆశిక్ కాళీ, అరుణ్, మరిడియ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల బాబు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, సత్యనారాయణ, తూతిక రాజు, కొరుపూరు రాజు, పొలమరశెట్టి సత్తిబాబు, ఒబిలిశెట్టి గణేష్ పాల్గొన్నారు.

తాళ్లరేవు జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం నిర్వహించారు. తాళ్లరేవు తహశీల్దారు కార్యాలయం నుంచి సంతపేట సెంటర్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం సంతపేట సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అత్తిలి బాబూరావు, జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ముత్యాల జయలక్ష్మి, దూడల స్వామి, మద్దింశెట్టి పురుషోత్తం, బద్రి రమ, మత్తుర్తి సత్య మణికంఠ, సుందరపల్లి సత్యనారాయణ, బండారు దొరబాబు, చిక్కం రామచంద్రుడు, గండి అనిల్, పుణ్యమంతుల సత్తిబాబు, పోతాబత్తుల రాంబాబు, సూరంపూడి కుమార్, బోనం శ్రీనివాస, కొటికలపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో శాంతి ర్యాలీ చేపట్టారు. మేడిశెట్టి కిరణ్ మాట్లాడారు. పెంటకోట మోహన్, దాసం శేషగిరి, మసిరపు నాగేశ్వరరావు, ఎండి అధికార్, బంక కోదండరాం, పొట్ట సత్యనారాయణ, మేకల కృష్ణ, కరణం సుబ్రహ్మణ్యం, కొల్లిపర దుర్గా శ్రీనివాస్, దళె జ్యోతి పాల్గొన్నారు.

కాకినాడలో ర్యాలీ నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పిఠాపురం సిపిఎం ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న భగత్ సింగ్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం సాయిబాబా గుడి, చర్చ్ సెంటర్, రామా టాకీస్ మీదుగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ కుంచే చిన్న కోనేటి రాజు, కె.నాగేశ్వరరావు, కె.మణి, సత్యనారాయణ, పి.సూర్యనారాయణ, మోహనాచార్యులు, గోవిందాచారి, పప్పుల వీరబాబు, గోపాలకృష్ణ, గోవిందు, కె.అప్పన్న, సిహెచ్.శ్రీనివాసు పాల్గొన్నారు.

పెద్దాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

పిఠాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

తాళ్లరేవులో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

రెండో రోజుకు వికలాంగుల దీక్షలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ వద్ద వికలాంగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వికలాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి బివివి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు విడుదల చేసి క్షేత్రస్థాయిలో నిధులు అందేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జిల్లా సమన్వయ కమిటీని పునర్నిర్మాణం చేసి జిల్లా సమన్వయ కమిటీని ఏర్పాటుతో పాటు దానికి చట్టబద్ధత కల్పించాలని న్యాయమైన తమ డిమాండ్లు అమలు చేయాలని తెలిపారు. ఈ శిబిరంలో అమలాపురం పట్టణ వికలాంగుల సమాఖ్య, అల్లవరం మదర్ థెరిస్సా వికలాంగుల సంఘం, అంబాజీపేట వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు

దీక్షలో పాల్గొన్న వికలాంగులు

క్రీడా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కూడా చైర్మన్ తుమ్మల రామస్వామి సూచించారు. సామర్లకోట అయోధ్యరాంపురంలో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఎస్‌బిఎస్‌ఆర్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం సాయంత్రం ఎంఎల్ఎ చినరాజప్ప, కూడా చైర్మన్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలే కూటమి ప్రభుత్వం క్రీడా కోటాను ఒక శాతం పెంచినందున క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. తొలుత రిబ్బన్ కత్తిరించి ఖోఖో, కబడ్డీ కోర్టులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్, కోశాధికారి నిమ్మకాయల కిరణ్ కుమార్, ఉపాధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ, రిటైర్డ్ పిఇటి తాళ్లూరి వైకుంఠం, కోచ్ బోగిళ్ల మురళీ కుమార్, టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బలుసు వాసు, యార్లగడ్డ చిన్ని, గొల్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడా కోర్టును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

నేరాలు ఘోరాలు

ఆందోళన చేస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

గాయపడిన స్వర్ణకారుడు మృతి

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వర్ణకారుడు మృతి చెందాడు. దీంతో న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు కలువపువ్వు సెంటర్లో రాస్తారోకోకు దిగారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండపేట టిడ్కో కాలనీలో మాదాబత్తుల సత్తిబాబు(40) నివాసం ఉంటున్నాడు. మండపేట రథం సెంటర్‌లో వెండి పట్టీల తయారీ కార్మికునిగా పని చేస్తున్నాడు. గురువారం ఎప్పటిలానే పనికి వెళ్లాడు. రాత్రి పని ముగించుకుని రోడ్డు దాటుతుండగా సుమన్ అనే వ్యక్తి బైకుతో అతి వేగంగా వచ్చి సత్తిబాబును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సత్తిబాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సత్తిబాబు చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. దీంతో సత్తిబాబు కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంగారు వర్తకుల సంఘం అధ్యక్షులు సంకా శ్రీనివాస్ రంగా, స్వర్ణకారులు సంఘం అధ్యక్షులు వెదురుపర్తి రామకృష్ణ ప్రసాద్, కామాక్షి వెండి పనివార్ల సంఘం అధ్యక్షులు అడపా వాసు, వైసిపి నాయకులు కొమ్ము రాంబాబు, పతివాడ రమణ ఆధ్వర్యంలో కలువపువ్వు సెంటర్‌లో మృతదేహంతో రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న మండపేట మున్సిపల్ చైర్మన్ పతివాడ రాణి రాస్తారోకో వద్దకు చేరుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న టౌన్ సిఐ సురేష్ ఆందోళన కారులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో ఉన్న ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ఫోన్‌లో సిఐతో మాట్లాడారు. జరిగిన ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని సిఐ హామీ ఇవ్వడంతో ఆందోళన కారులు రాస్తారోకో విరమించారు.

గుర్తు తెలీని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని రౌతులపూడి గ్రామ శివారు బంగారయ్యపేట ఏలేరు వంతెన వద్ద శుక్రవారం సుమారు 60 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రత్తిపాడు, శంఖవరం మండలాల వైపు నుండి ఏలేరు కాలవ వెంబడి మృతదేహం కొట్టుకు వచ్చిందన్నారు. తెలుపు రంగు మీద నలుపు చారలు కలిగిన చొక్కా ధరించి 5,5 అడుగులు ఎత్తు, తెలుపు రంగు జుట్టు కలిగి ఉన్నట్టు తెలిపారు. వివరాలకు రౌతులపూడి పోలీస్ స్టేషన్‌ను 7075571014లో సంప్రదించాలని అన్నారు.

ఏడు ఇసుక లారీల స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

వంగలపూడి ఇసుక ర్యాంపు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఏడు లారీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను ఆక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించారు. సీతానగరం జివికె ఫంక్షన్ హాలు వద్ద ఏడు లారీలను గుర్తించారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వంగలపూడి ఇసుక ర్యాంపులో గురువారం రాత్రి 10 గంటలు దాటిన తర్వాత కూడా జోరుగా అక్రమ ఇసుక రవాణా జరుగుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక తవ్వకాలు, రవాణాకు అనుమతి ఉంది. అయితే కొందరు నిబంధనలను ఉల్లంఘించి రాత్రిపూట కూడా భారీగా ఇసుకను తరలిస్తున్నారు. పట్టుబడిన లారీల్లో ఇసుక చిత్రాడ, విశాఖకు తరలించేందుకు సిద్ధం చేసినట్టు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న 26 మంది అరెస్ట్

ప్రజాశక్తి - కోరుకొండ

ఎస్‌పి ఆదేశాలతో స్పెషల్ పార్టీ పోలీసులు కోడిపందేలా స్థావరంపై దాడి చేసి కోడిపందేలు ఆడుతున్న 26 మందిని అరెస్ట్ చేసినట్లు కోరుకొండ ఎస్ఐ టి.శ్యామ్‌సుందర్ తేలిపారు. తమకు అందిన సమాచారం మేరకు మధురపూడి గ్రామ శివారున నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై దాడి చేవారు. నిందితుల నుంచి రూ.96,770 నగదు, 25 సెల్ ఫోన్లు, మూడు కార్లు, 20 బైకలు, 3 కోళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఉప్పాడలో విగ్రహాల చోరీ

ప్రజాశక్తి-యు కొత్తపల్లి

ఉప్పాడ నాయకర్ కాలనీలో రామాలయంలో ఉత్సవ విగ్రహాలు చోరీకి గురయ్యాయి. గురువారం అర్ధరాత్రి సమయంలో ఈ విగ్రహాలు అపహరించినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. గతేడాది మత్స్యకార గ్రామంలో ఈ ఆలయం నిర్మించినట్టు తెలిపారు. ఉప్పాడ గ్రామంలో నిత్యం చోరీలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యువకునిపై కత్తితో దాడి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్థలం విషయంలో ఒక యువకునిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలైన సంఘటన కాకినాడ రూరల్ మండలం ఎస్.అచ్యుతాపురంలో చోటుచేసుకుంది. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ రూరల్ మండలం ఎస్.అచ్యుతాపురంలోని చిన్న అంబేద్కర్ వీధిలో పక్కపక్కనే నివాసం ఉంటున్న కుక్కల నాని, పెంటి జాజి కుటుంబాల మధ్య స్థలం విషయంలో కొంతకాలంగా విభేదాలు ఉన్నాయి. గతంలో కూడా స్థలం విషయంలోనే నానిపై జాజి దాడి చేసినట్టు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఇంట్లో నిద్రిస్తున్న కుక్కల నానిపై జాజి కత్తితో దాడి చేయగా తీవ్ర గాయాలు పాలయ్యాడన్నారు. నానిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. సంఘటనా స్థలాన్ని కాకినాడ రూరల్ చైతన్య కృష్ణ పరిశీలించారు. ఇంద్రపాలెం పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

మండలంలోని ఉప్పాడలో రూ.2 కోట్ల నిధులతో టిటిడి ఆధ్వర్యంలో కళ్యాణమండపం నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. పిఠాపురం నియోజకవర్గ పర్యటన సందర్భంగా దేవాదాయ ధర్మదాయ శాఖకు సంబంధించి రూ.132 లక్షల నిధులతో గొల్లప్రోలులో సీతారామ స్వామి దేవస్థానం ఆలయ ప్రాకార మండపం, చేబ్రోలులో రూ.48 లక్షల నిధులతో ఆలయ కాలక్షేప మండపం, రథశాల నిర్మాణానికి ఉప్పాడ నుంచే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ, జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, జనసేన నాయకులు సురక్ష హాస్పిటల్ అధినేత జ్యోతుల శ్రీనివాస్, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రేడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మంత్రి పవన్ కళ్యాణ్

ఆదిత్యలో క్రొమటోగ్రఫీపై సెమినార్, వర్క్‌షాప్

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం, యుకెకు చెందిన రాయల్ సొసైటీ అఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో ఆధునిక క్రోమటోగ్రఫీ పద్ధతులపై పరిశోధకులకు, పీజీ విద్యార్థులకు రెండు రోజుల అంతర్జాతీయ సెమినార్, వర్క్‌షాప్ నిర్వహించినట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. జ్యోతి ప్రజ్వలన, ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా ఆదికవి నన్నయ యూనివర్సిటీ కెమిస్ట్రీ బోర్డు అఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ బి.జగన్మోహన్ రెడ్డి వ్యవహరించి ప్రారంభోపన్యాసం చేశారు. ఫార్మాస్యూటికల్ కంపెనీలలో క్రోమటోగ్రఫీ ఆవశ్యకతను తెలిపారు. ఆదిత్య కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు సెమినార్ విశిష్టతను తెలిపి, ఈ విధమైన సదస్సులు భావ వినిమయానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. డిగ్రీ, పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అంతర్జాతీయ సెమినార్ మరియు వర్కుషాప్ నిర్వహిస్తున్న కళాశాల రాసాయనశాస్త్ర విభాగాన్ని అభినందిస్తూ, విద్యార్థులు క్రోమటోగ్రఫీ లో మెళకువలు నేర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య రసాయన శాస్త్ర విభాగాధిపతి కె.సురేష్ కుమార్, అధ్యాపకులు కె.నాగు, వి.సోమేశ్వర రావు, కె.వీరబాబు, బి.దివ్య పాల్గొన్నారు.

సెమినార్‌లో పాల్గొన్న పరిశోధకులు, అధ్యాపకులు

7 నుంచి ఉచిత సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ (పిసిసి) ఆధ్వర్యంలో మే 7వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు బాలలకు ఉచిత సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ వేసవి శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను చిల్డ్రన్స్ క్లబ్ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వేసవి శిబిరం వరుసగా నాలుగోసారి నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఉదయం 6:30 గంటల నుంచి 8:30 గంటల వరకూ కరాటేలో శిక్షణ ఇస్తారన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తారన్నారు. మే 5వ తేదీ లోగా సమ్మర్ క్యాంపునకు వచ్చేవారు వివరాలను రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. మిగిలిన వివరాల కోసం 9441709187, 9000695301, 7901697939 నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని పిల్లలు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ కుమార్, అమృత, నమ్రత, మణికంఠ, యోగేష్, నాని, బాల మురళీకృష్ణ, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

ఆరోగ్యంపై ఎన్‌సిసి క్యాడెట్లకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయలో 18 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి క్యాడెట్‌లకు ఆరోగ్య పరిరక్షణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వాసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ ఎ.విజయలక్ష్మి క్యాడెట్లకు హెచ్‌పివి వ్యాక్సిన్, హై రిస్క్ రోమన్ పాపిల్లోమా వైరస్, సర్వికల్ క్యాన్సర్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శరీర ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ మేజర్ కె.మహమ్మద్ ఆసిఫ్ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా క్రమశిక్షణ, ఐకమత్యం, దేశభక్తి పెంపొందితుందన్నారు. స్పోర్ట్స్ స్పిరిట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ క్యాడెట్లల్లో అభివృద్ధి చెందేందుకు వాలీబాల్, ఖోఖో, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. లెఫ్టినెంట్ సత్యనారాయణ, సుబేదార్ మేజర్ కె.హేమంత్ కుమార్, సెకండ్ ఆఫీసర్ రాంబాబు, థర్డ్ ఆఫీసర్ ప్రసాద్, సిహెచ్.అబ్బులు, శక్తి వేణు, రఫీ, గురువింద పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

టిడిపి కార్యకర్తలు తమ పరిధిలో ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప సూచించారు. శుక్రవారం స్థానిక వత్సవాయి భవనంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు అధ్యక్షతన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వార్డులో తొమ్మిదిమంది కార్యకర్తలను నియమించి ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న సేవలను, పథకాలను, అభివృద్ధిని వివరించాలన్నారు. టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రంధి సత్యనారాయణ, టి.రాజు, కొరుపూరి రాజు, బి.ఉదయ్ కుమార్, వీరబాబు, గడ్డం పెద్దకాపు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జెసి ఎస్.చిన్నరాముడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ప్రేమకుమార్, డిఎస్ఒ ఎస్.భాస్కర్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి ఎం.జనార్ధనరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు తదితరులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో రబీ సీజన్ ధాన్యం సేకరణ విషయంలో గ్రామ స్థాయిలో ఉన్న రైతు సేవా కేంద్రం - ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి పర్యవేక్షణ వ్యవస్థ సమర్ధవంతంగా పని చేయాలన్నారు. ఇందు కోసం జిల్లా డివిజన్ మండల స్థాయిలో ఆయా శాఖల ఆధ్వర్యంలో అందుకు అనుగుణంగా షెడ్యూల్ చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో కంట్రోలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని జెసికి సూచించారు. రైతు సేవా కేంద్రాలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసిన వాటిని ఇతర ఆర్ ఎస్‌కెలతో అనుసంధానం చేయాలన్నారు. కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలన్నారు. జిల్లా సహకార అధికారి అధ్వర్యంలో పని చేసే క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది చురుకైన పాత్ర పోషించాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలకు, బహిరంగ మార్కెట్ కు సంబంధించిన లావాదేవీలని ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పహల్గావ్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో కంబాల చెరువు నుంచి గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకూ శుక్రవారం కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జయకర్, ఎ.షరీఫ్ మాట్లాడారు. ఉగ్రవాదుల దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ఎం.విజయగౌరి, జిల్లా కార్యదర్శులు ఈ.శ్రీమణి, కె.రమేష్‌బాబు, చిలుకూరి శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసు, కె.దయానిది, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్‌రావు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.అనిత, ప్రకాష్‌రావు, విజయ్‌బాబు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజమండ్రి ప్రెస్‌క్లబ్ వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ నుంచి జాంపేట గాంధీ విగ్రహం వరకూ జర్నలిస్టులు ఎం.పార్థసారథి, గోపి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దాడికి దిగిన ఉగ్రవాదును కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో బ్యారేజ్ సెంటర్‌లో వద్ద మానవహారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిఐ గణేష్ హాజరై మాట్లాడారు. ఉగ్రవాదుల దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు. మతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగల్లు : జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా చాగల్లులో ఇస్లాంపేట జామియా మసీదులో శుక్రవారం నమాజ్ అనంతరం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్టాప్ టెర్రరిస్ట్ స్టాండ్ ఫర్ హ్యుమానిటీ పేరుతో ఈ ర్యాలీని నిర్వహించారు.

శిక్షణలో మాట్లాడుతున్న పరిశీలకులు సుదర్శన్

వేసవి శిక్షణా శిబిరం పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

అటల్ టింకరింగ్ ల్యాబ్ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని యూనిసెఫ్ రాష్ట్ర పరిశీలకులు టి.సుదర్శన్ పిలుపునిచ్చారు. సామర్లకోట జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు డిఇఒ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ బూట్ వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం యూనిసెఫ్ రాష్ట్ర అబ్జర్వర్ టి.సుదర్శన్ పరిశీలించారు. ఈ కార్యక్రమానికి హైస్కూల్ హెచ్‌ఎం యు.మీనా మాధురి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గండేపల్లి, కిర్లంపూడి, సామర్లకోట జిల్లా పరిషత్ పాఠశాల నుంచి 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి అటల్ టింకరింగ్ ల్యాబ్ బోట్‌పై శిక్షణ తరగతులు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిక్షణలో పిట్టో బ్లాక్, కోడింగ్, ఫోటో ట్రానిక్స్, కోడింగ్, త్రీ డి డిజైనింగ్ అండ్ ప్రింటింగ్ రంగాల్లో శాస్త్ర సాంకేతిక అంశాల మీద ఎంపిక చేసిన 50 మంది విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఇన్‌ఛార్జి కల్యాణ చక్రవర్తి, డిఎస్ఒ వినీల్, సామర్లకోట ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ల్యాబ్ ఇన్చార్జ్ టి.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు డిప్యూటీ సిఎం పవన్ అభినందన

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ 94వ ర్యాంకు సాధించిన పిఠాపురం పట్టణానికి చెందిన చక్కా స్నేహిత్ శుక్రవారం పిఠాపురం రథాల పేటలోని అంబేద్కర్ సామాజిక భవనంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా స్నేహిత్‌ను అభినందించారు.

దోమ కాటు నివారణపై జాగ్రత్తలు

ప్రజాశక్తి-శంఖవరం

శంఖవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది దోమ కాటుకు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పిహెచ్‌సి వైద్యులు ఆర్‌వివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో డాక్టర్ ఎస్ఎస్.రాజీవ్ కుమార్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా డాక్టర్ ఆర్‌వివి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలలో మార్పు వస్తేనే మలేరియా వ్యాధి అంతమవుతుందని చెప్పారు. మరొక వైద్యుడు రాజీవ్ కుమార్ మాట్లాడుతూ దోమ కాటు వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ బి.ఎర్రబ్బాయి, దంత వైద్యులు డాక్టర్ రవిశంకర్, సిహెచ్ఒ మేరీమణి, కృష్ణకుమారి, ఎవి.సూర్యనారాయణమ్మ పాల్గొన్నారు.

సత్యదేవుని ఆదాయం రూ.1.26 కోట్లు

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి వారికి హుండీల కానుకలు లెక్కింపు ద్వారా రూ.1,26,,07,501 ఆదాయం లభించింది. శుక్రవారం కొండపైన ఇఒ వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవి.రోహిత్ సమక్షంలో అధికారులు 28 రోజుల్లో వచ్చిన వివిధ హుండీలలో యాత్రికులు వేసిన కానుకలను లెక్కించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఒ కొండలరావు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులకు కిరాణా సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మదర్ థెరిస్సా కాలనీలోని 34 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు మిరాకిల్ మినిస్ట్రీస్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ తిరుమాలి డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ పాల్ ఆధ్వర్యంలో శుక్రవారం కిరాణా, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా కాలనీ ప్రెసిడెంట్ జె.సుధాకర్, డాక్టర్ దార్ల విజయకుమార్, డాక్టర్ ఎలీజా, డాక్టర్ లంక పురుషోత్తమ దాస్, డాక్టర్ సిబిఐ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారిని శుక్రవారం పెద్దాపురం ఆర్‌డిఒ శ్రీరమణి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు, ఆసాదులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శుక్రవారం అమ్మవారికి వేద పారాయణంతో వెండి, బంగారు పుష్పాలతో పూజలు, అర్చనలు చేశారు. ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారి ఐవి.ప్రసాద్ శర్మ, వేద పండితులు ఎన్‌వి.అవధాని, శంకర్, ఆశాధులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ వరహాలు, శివ తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కులోత్తుంగన్

పారిశుధ్య సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - యానాం

యానాం మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య సమస్య పరిష్కారమయ్యిందని పుదుచ్చేరి కలెక్టర్ కులోంగుత్తన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసేది డంపింగ్ యార్డు కాదని రిసోర్స్, రికవరీ పార్క్ అని తెలిపారు. ఆధునిక యంత్రాలతో రిసోర్స్ రికవరీ పార్క్ ఏర్పాటు చేస్తుందన్నారు.త్వరలోనే రిసోర్స్ రికవరీ పార్క్ ఏర్పాటు జరుగుతుందని ప్రజలంతా ఈ ప్రక్రియకు సహకరించాలని కోరారు. రిసోర్స్ పార్క్ అంతా ఉన్నత ప్రమాణాలతో, రక్షణాత్మక చర్యలతో నిర్మాణం చేపడతామని తెలిపారు. పార్క్ కోసం ఎవరూ భయాందోళనలు చెందవద్దని తప్పుగా అర్థం చేసుకోవద్దన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రిసోర్స్ రికవరీ పార్క్ ఏర్పాటు జరుగుతుందని డంపింగ్ యార్డు కాదన్నారు. కొన్ని నెలల్లో కనకాలపేట డంపింగ్ యార్డు వద్దనున్న చెత్తను సైతం రిసోర్స్ రికవరీ పార్క్ యంత్రాలతో బయోమైనింగ్‌గా మారుస్తారన్నారు. కనకాలపేటలో భారీగా పోగుపడిన చెత్తను సంబంధిత కాంట్రాక్టు సంస్థ 6 నుంచి 8 నెలల్లో చెత్తను పూర్తిగా తొలగిస్తుందన్నారు.

పలు ఆఫీసులు, జిజిహెచ్ సందర్శన

యానాం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించానని అక్కడ కావాల్సిన మౌలిక సౌకర్యాలు కల్పిస్తామమని కలెక్టర్ తెలిపారు. ల్యాబొరొటరీ తదితరమైన వాటి గురించి అక్కడ ఉన్న అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు. అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ సమావేశంలో ఆర్‌ఎఒ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించని అధికారులు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గ అభివృద్ధికి కొంతమంది అధికారులు విఘాతంగా మారారని ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాసనాథన్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాజ్ భవన్‌లో ఆయనను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఎంఎల్‌ఎ లాడ్, ఎంఎల్‌సి, సిఎస్ఆర్, ఆది ద్రావిడ తదితర శాఖలు ద్వారా కోట్లాది రూపాయిలు నిధులు మంజూరయిన్నప్పటికీ పనులు కావాలనే ఆలస్యం చేస్తున్నారన్నారు. అభివృద్ధికి విఘాతంగా మారిన అధికారులను పుదుచ్చేరికి బదిలీ చేయాలని కోరడంతో ఈ సమస్యపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పవర్ గ్రిడ్ వద్ద చెత్తను డంపు చేస్తున్న సిబ్బంది

యానాంలో చెత్త కుప్పల తొలగింపు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి కలెక్టర్ కులోంగోత్తన్ ఆదేశాల మేరకు ఆర్‌ఎఒ మునిస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పేరుకుపోయిన చెత్త కుప్పలను శుక్రవారం సంబంధిత అధికారులు దగ్గరుండి తొలగించారు. సేకరించిన చెత్తను స్థానిక గోపాల్ నగర్ పవర్ గ్రిడ్ వద్ద పోలీస్ బందోబస్తుతో డంపు చేశారు. ముందస్తు చర్యలుగా పవర్ గ్రిడ్ వద్ద డంపింగ్ యార్డ్ పెట్టొద్దంటూ ఆందోళన చేస్తున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, శ్రీనివాసుల రామ్‌కుమార్, మంతెన సూర్యనారాయణ రాజు, పి.అశోక్‌ను పోలీసుల అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం ట్రాక్టర్లతో పవర్ గ్రిడ్ వద్ద చెత్తను డంపు చేశారు. మధ్యాహ్నం ఆందోళనకారులను పోలీసులు విడిచిపెట్టారు.

ఆదిత్య విద్యార్థుల సీపోర్ట్ సందర్శన

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ మేనేజ్మెంట్ విభాగం విద్యార్థులు కాకినాడ సీపోర్ట్‌ను సందర్శించారని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. విద్యార్థులు ప్రత్యక్షంగా ఇటువంటి క్షేత్ర స్థాయి పరిశీలన చేయడం ద్వారా పరిజ్ఞానాన్ని పొందవచ్చని తెలిపారు. కాకినాడ సీ-పోర్టు నుంచి ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులైన బియ్యం, తణధాన్యాలు, సీ-ఫుడ్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు చైనా, కొరియా, జపాన్ మొదలగు దేశాలకు ఎగుమతులు చేస్తున్నామని పోర్ట్ అధికారులు తెలిపారు. బొగ్గు, ఫెర్టిలైజర్స్, ఎడిబుల్ ఆయిల్, కెమికల్స్ మరియు గ్యాస్ వంటి వాటిని కాకినాడ సీ-పోర్ట్ నుంచి దిగుమతులు చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్-ప్రిన్సిపల్ ఎ.విజయ భార్గవి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఎం.గోవర్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు.

కళాశాల శిథిల భవనాలపై వినతి

ప్రజాశక్తి- సామర్లకోట

సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరినందున వాటిని తొలగించి నూతన భవనాల నిర్మాణానికి తగు చర్యలు చేపట్టాలని పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయలు చినరాజప్పకు మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం ఎంఎల్‌ఎకు అప్పలకొండ వినతి పత్రం అందజేశారు. భవనాల పరిస్థితిని వివరించారు. పాత భవనాలు శిథిలం కావటం కొత్త భవనాల నిర్మాణం పూర్తి కాకపోవటంతో సుమారు 500 మంది పైగా ఇంటర్మీడియట్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. నూతన భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు.

మలేరియాపై అవగాహన అవసరం

ప్రపంచ మలేరియా నివారణా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పలుచోట్ల అవగాహనా ర్యాలీలు, సమావేశాలను నిర్వహించారు.

రాజమహేంద్రవరం రూరల్ డిఎంహెచ్ఒ కార్యాలయంలో ప్రపంచ మలేరియా నివారణా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరావు మాట్లాడారు. ఈ సంవత్సరం 'మలేరియా అంతం మనతోనే' అనే నినాదంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా మలేరియా అధికారి ఎ.జ్ఞానశ్రీ మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే, ఫ్రైడే పాటించాలన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ ఎన్. సత్యకుమార్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఆర్.ఉషాదేవి ఆధ్వర్యంలో మలేరియా నివారణా దినోత్సవాన్ని నిర్వహించారు. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. సొంత వైద్యం చేసుకోరాదన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శ్రీనివాస్ మలేరియా లక్షణాలు, రాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

ప్రకటన

నా తాలూకు స్థిరాస్తి లింకు డాక్యుమెంటు నెం. 1326/1985 సామర్లకోట సబురిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిస్ట్రీ కాబడిన క్రియ దస్తావేజు ది. 08-4-2025వ తేదీన నా యింటి నుండి అనగా డోరు నెం. 69-3-15/డి2 గైగోలుపాడు నుండి సర్పవరం జంక్షనుకు జిరాక్సు కొరకు వచ్చుచుండగా మార్గ మధ్యములో పడిపోయినది. కనుక యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా, సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఎడల నాకు అందజేయగలరు. అందుకు తగిన బహుమతి యివ్వబడును.

నా చిరునామా: **దోకిపర్తి సత్య దినకర్**
S/o. శ్రీ రామాంజనేయులు
డోరు నెం. 69-3-15/డి2, గైగోలుపాడు
కాకినాడ మండలం, సెల్: 8885550975

దస్తావేజులు పోయినవి

కాకినాడ జిల్లా, కాకినాడ గ్రామం, కాపురస్తులు **యండమూరి భాగ్యలక్ష్మి, W/o.** నూకరాజు అను నేను యావన్మందికీ తెలియజేయునది ఏమనగా. నా ఆస్తికి సంబంధించిన **దస్తావేజు నెం. 3866/1995** మరియు రెండవ **దస్తావేజు నెం.2161/2000**లను నా వారసులకు రాయాలనే ఉద్దేశంతో ది.03-04-2025 తేదీనాడు కాకినాడ సబ్- రిజిష్టర్ ఆఫీస్‌కు వెళ్లెటప్పుడు మార్గమధ్యలో పడిపోయాయి. ఎంత వెతికినను దొరకలేదు ఎవరికైననూ దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు.

యండమూరి భాగ్యలక్ష్మి, W/o. నూకరాజు,
డో.నెం. 30-8-27, రంగయ్య నాయుడు వారి వీధి,
కాకినాడ. సెల్: 8885147117